క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎంపీ బాలశౌరి



మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవి శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆదివారం బందరు ఎంపీ బాలశౌరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక: అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాలెం గ్రామానికి చెందిన మండ సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావు సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్లు(ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

ఇనగుదురుపేట సీఐ విద్యాసాగర్ బాధ్యతల స్వీకరణ



కోనేరుసెంటర్: ఇనగుదురుపేట సీఐగా చల్లపల్లి విద్యాసాగర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా రాజమండ్రి సీఐగా పని చేస్తున్న విద్యాసాగర్‌ను కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఇనగుదురుపేట స్టేషన్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన విద్యాసాగర్ ఇప్పటి వరకు సర్వీసు మొత్తం తూర్పు గోదావరిలో చేశారు. 2023 ఆగస్టులో సీఐగా పదోన్నతి పొందిన ఆయన రాజమండ్రి టౌన్ సీఐగా పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి బదిలీ అయిన విద్యాసాగర్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు.

నగరపాలక సంస్థ పార్కులో రక్తపరీక్షలు



మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక నగరపాలక సంస్థ ప్రధాన పార్కులో రక్త పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, థైరాయిడ్ తదితర రక్త పరీక్షలు చేశారు. కొన్నింటిని ఉచితంగా చేయగా మరికొన్ని పరీక్షలను సగం ధరకే నిర్వహించారు. వైద్యశిబిరాన్ని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అనుబంధ వాసవీ క్లబ్ కపుల్స్ క్లబ్ ప్రతినిధులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, క్లబ్ ప్రతినిధి యెండూరి సురేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి పీడితుడికి ఆర్థిక సాయం



గణపేశ్వరం(నాగాయలంక): గ్రామవాసి చాట్రగడ్డ బాబూరావు కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైఎస్సార్ సీపీ నేత, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు ఈ విషయాన్ని అవనిగడ్డలోని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిశోర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన నాయుడు బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదును ఆదివారం ఆయన స్వయంగా అందజేశారు. సాయిబాబు, తోట నరసింహనాయుడు, పులిగుజ్జు పెదబాబు, మేడికొండ ధనరాజు, పిరాటి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకు కానుకలు

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయాల అర్చకులకు సంక్రాంతి కానుకల పంపిణీ చురుగ్గా సాగుతోంది. మండలంలోని దేవరపల్లిలోని పలు ఆలయాల అర్చకులకు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి నూతన వస్త్రాలు, మిఠాయిలను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కొల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనవలమ్మ జాతర

మచిలీపట్నంటౌన్: నగరంలో బైపాస్ రోడ్డు నిజాంపేటలోని ఆది వనవలమ్మదేవి జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి 107వ వార్షిక గ్రామోత్సవంలో భాగంగా జాతర నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కోళ్లు, గొర్రెలు, మేకలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అన్న నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరి కనిపించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఆలయం వద్ద 22వ తేదీ సోమవారం అమ్మవారికి వెండిచీర అలంకరించి పూజలు చేసి అన్న సమారాధన నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త నూతి వనవెంకట సత్యనారాయణ(రమణ) తెలిపారు. ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన పలు దుకాణాల వద్ద చిన్నారులు బొమ్మలు, పెద్దలు పలు రకాల వస్తువులు కొనుగోళ్లతో ఆ ప్రాంతం సందడిగా మారింది.



ఆలయంలో బందరు మేయర్ వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు దంపతులు



పూజలందుకున్న ఆదివనవలమ్మ



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



అమ్మవారి చిత్రపటం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వనవలమ్మను దర్శించుకున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

నిజాంపేటలోని ఆదివనవలమ్మ దేవిని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త నూతి వనవెంకట సత్యనారాయణ(రమణ) స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

అయోధ్య రాముడి సంబరాలకు సిద్ధం

బంటుమిల్లి: అయోధ్యలో సోమవారం జరగనున్న బాలరాముడి విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని గ్రామాల్లో సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రామాలయాల్లో ఉదయం నుంచి ఏకనామాలు, రామభజనలు, సీతారాముల శాంతి కల్యాణాలు, అన్నదానాల ఏర్పాట్లు జరిగాయి. రెండు రోజులుగా గ్రామాల్లో రాములవారి ముద్రణతో కాషాయ జెండాలు కట్టి చిత్రపటాల బ్యానర్లు కట్టారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యాన పాశ్చాపురం గ్రామంలోని రామాలయం నుంచి జానకీరామపురం గ్రామం వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించనున్నారు.

మచిలీపట్నంటౌన్: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట ఉత్సవం సందర్భంగా నగరంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యాన స్థానిక కోనేరు సెంటర్‌లో ఈ నెల 22వ తేదీ సోమవారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. కోనేరుసెంటర్‌లోని మునిసిపల్ దుకాణ సముదాయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉదయం 11.30 గంటలకు అయోధ్యలో జరిగే బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా తిలకించనున్నారు. 2 గంటలకు భక్తులు సామూహిక భగవద్గీత పారాయణం చేయనున్నారు. 3 గంటలకు శ్రీ సాయిమల్లయ్య భజన సమాజం వారితో భజన చేస్తారు. 6 గంటలకు నగరంలోని శ్రీ భద్రాద్రి రామాలయం నుంచి కోనేరుసెంటర్ వరకు అఖండ జ్యోతులతో మహిళా భక్తులు ఊరేగింపు నిర్వహించనున్నారు. జగన్నాథపురం రామాలయం నుంచి స్వామివారు, అమ్మవార్లను పల్లకీలో ఊరేగింపుగా కోనేరు సెంటర్ తీసుకువచ్చి అనంతరం సీతారాముల కల్యాణ కనులపండువగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు నగరంలోని వ్యాపారులు వారి దుకాణాలను మధ్యాహ్నం నుంచి మూసివేసి కార్యక్రమంలో పాల్గొననున్నారు.

కోడూరు: అయోధ్యలో శ్రీరామమందిర విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకొని సోమవారం కోడూరులో సీతారామచంద్రుల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి స్థానిక అన్నం కిషోర్ రైస్‌మిస్ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 10వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన స్థూపం, పక్కన ఫ్లెక్సీలు



కోనేరు సెంటర్‌లో దుకాణ సముదాయానికి విద్యుత్ దీపాలంకరణ

నేడు రాములోరి ఊరేగింపు

నాగాయలంక: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా స్థానిక జై వాసవీ గ్రూపు, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రం నాగాయలంకలో రాములోరి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కన్యకాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో హనుమాన్‌కు పూజలు చేసి శ్రీరాముడు, శ్రీవాసవీ మాత చిత్రపటాలతో గ్రామోత్సవం ఉంటుందన్నారు. అనంతరం అయోధ్యలో బాలరాముని ప్రతిష్ట సమయంలో ప్రధాన కూడలిలో ఆర్యవైశ్య సంఘం పెద్దలతో భక్తులకు పానకం ప్రసాద వితరణ చేస్తామన్నారు.

లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, శాంతి హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమాలను ఆగమ పండితుడు బృందావనం నరసింహమూర్తి నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



స్వామివారికి యాగం చేస్తున్న అర్చకులు

వాసవీ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ వనిత పామర్రు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక శ్రీ బొగ్గరపు జాలయ్య సుబ్బరత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ క్లబ్ జిల్లా గవర్నర్ కొత్త గణేష్‌బాబు హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకరణ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతపర్చాలన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్, ప్రధాన కార్యదర్శిగా చిన్నం మురళీ సుధాకర్, కోశాధికారిగా కంచర్ల వీర జనార్ధనరావుతో తొలుత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలిగా ఘంటసాల సునీత, ప్రధాన కార్యదర్శిగా చిన్నం జయలక్ష్మి, కోశాధికారిగా కంచర్ల ఉషారాణి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు తొలి సేవా కార్యక్రమంగా వాసవీ వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని ప్రారంభించి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి శనగపల్లి సురేష్, జిల్లా కోశాధికారి చిట్టూరి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి రమణబాబు, జిల్లా వైస్ గవర్నర్ అన్నం సాయి సునీత తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రౌనాక్‌జహ 2017వ సంవత్సరంలో ఉయ్యూరుకు చెందిన ఎండీ రియాజ్‌పాషాను వివాహం చేసుకుంది. వీరు యనమలకుదురులో కాపురం పెట్టారు. భర్త విజయవాడలో కారు షాపులో హెల్పర్‌గా పని చేస్తాడు. కాగా ఈ నెల 17న రౌనాక్‌జహ అదే గ్రామంలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. భర్త ఇంటి వద్దే ఉంటూ భార్య పుట్టింట్లో భోజనం చేస్తున్నాడు. 17న భోజనం చేసిన భర్త పోరంకి వెళ్లి వస్తానని భార్యకు చెప్పాడు. అయితే రాత్రి వరకు రియాజ్‌పాషా రాకపోవటంతో భార్య రౌనాక్‌జహ ఫోన్ చేయగా ఫోన్ పని చేయలేదు. 18వ తేదీ కూడా భర్త ఫోన్ పని చేయకపోవటంతో ఇంటికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. తాళం పగులకొట్టి ఇంట్లో చూడగా బీరువాలో రూ.9 వేలు, బంగారు ఆభరణాలు కనబడలేదు. భర్త కోసం వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ప్రజా చైతన్య యాత్ర

కంకిపాడు: షెడ్యూల్ కులాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి పని చేస్తోందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ దళిత కులాలకు రిజర్వేషన్ ఫలాలు ప్రతి ఇంటికీ చేరాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కాంక్షిస్తూ సోమవారం ఉదయం 11 గంటలకు కంకిపాడు ప్రధాన సెంటర్ నుంచి ప్రజా చైతన్య యాత్ర చేపడుతున్నామన్నారు. మండలంలో ఈ నెల 28వరకూ అన్ని గ్రామాల్లో చైతన్యయాత్ర సాగుతుందన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

పెదమద్దాలి(పామర్రు): మండలంలోని పెదమద్దాలి శివారుకొత్తపెదమద్దాలి గ్రామంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం గణేష్, అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రతిష్టాచార్య గూడూరు సంపత్ శర్మ ఆధ్వర్యంలో చేశారు. గణేష్ విగ్రహాన్ని స్థానికులు ఆవులూరి వెంకటేశ్వరరావు వీర రాఘవమ్మ దంపతులు అందజేయగా, అభయాంజనేయస్వామి విగ్రహాన్ని దాజుపల్లి యల్లమంద, మాణిక్యమ్మ, శివ నాగేశ్వరరావు కృష్ణకుమారి దంపతులు బహూకరించారు. దంపతులు పీటలపై కూర్చుని విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో నవులూరి వీర వెంకయ్య, నాగమణి దంపతులు అభిషేకరం చేశారు. అన్న సమారాధన చేసి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న దాతలు

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

కోనేరుసెంటర్: పలుగ్రామాల్లో పేకాట శిబిరాలపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం మెరుపుదాడి చేశారు. దాడుల్లో పలువురు పేకాటరాయుళ్ల నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలోని మురుగు కాలువ గట్టు వెంట ముళ్ల పొదల మధ్య పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై పద్మ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ. 21,700 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై పద్మ తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, అలాగే బెల్టుషాపుల నిర్వహణ, సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్సై పద్మ ఈ సందర్భంగా హెచ్చరించారు.

కార్మికులకు న్యాయం చేసేందుకు లెనిన్ కృషి

గుడివాడ టౌన్: కార్మిక, కర్షక వర్గాలకు న్యాయం చేసేందుకు తన జీవితాన్ని ఫణంగా పెట్టిన మహా నాయకుడు వీఐ లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం లెనిన్ వర్ధంతి సభ జరిగింది. తొలుత సీపీఎం నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు సీహెచ్‌ఎస్ నాగమల్లేశ్వరరావు, టౌన్ మహిళా కార్యదర్శి రజిని, యూటీఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, అల్లూరి నాగేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, సీపీఎం నాయకులు ఎల్.సురేంద్ర, బోయిన కుమారి, కమ్మిలి పాపారావు పాల్గొన్నారు.



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపునకు చర్యలు

కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): విధులకు హాజరుకాని అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపు ఉత్తర్వులను సోమవారం నుంచి జారీ చేస్తామని కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారితో అనేకసార్లు చర్చలు జరిపిందని, వారి డిమాండ్లలో చాలా వరకు ఆమోదించారని కలెక్టర్ పేర్కొన్నారు. తాను కూడా సంఘాలతో మాట్లాడి సమ్మె విరమించాలని కోరామని, శాఖాపరంగా అధికారులు కూడా పలు మార్లు వారితో మాట్లాడారని తెలిపారు. నిబంధనల ప్రకారం నోటీసులు కూడా జారీ చేశారని వివరించారు. ఆ మేరకు కొంత మంది విధుల్లో జాయిన్ అయ్యారని అటువంటి వారిని మినహాయించి ఇంకా విధుల్లో చేరని వారికి ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఉప్పాల హారిక, రాము

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామును నియమించినందున ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తారని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. కూడూరు–కిష్టాపురం గ్రామాల మధ్య మంజూరైన రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆమె రాముతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి ఉప్పాల రాంప్రసాదు కలలను కొడుకుగా రాము నెరవేరుస్తారని ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. జెడ్పీ నిధులు రూ. 70 లక్షలతో కూడూరు రోడ్డు, పలు సీసీ రోడ్లు, తాగునీటి పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, సర్పంచ్ కాగిత విజయలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు కె. వెంకటేశ్వరరావు, ఎస్. రాంబాబు, జి. రామానాయుడు, డి. భైరవలింగం, సీహెచ్ అనూష, ఆర్‌బీకె, పీఏసీఎస్ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ పెద్దలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కూడూరు వద్ద రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము

చకచకా కులగణన



వక్కపట్లవారిపాలెంలో కులగణన చేస్తున్న ఈఓపీఆర్డీ అప్పలనరసమ్మ



మోపిదేవిలో కులగణన నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ముమ్మరంగా కొనసాగుతోంది. వక్కపట్లవారిపాలెంలో సచివాలయం కింద ఆదివారం జరిగిన కులగణన పనితీరును మండల ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ వెరిఫికేషన్ చేసి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. మండలంలో 17,055 గృహాల్లో కులగణన సర్వేకు 298మంది ఎన్యుమరేటర్లు పని చేస్తున్నారని ఆమె చెప్పారు. 136 మంది సచివాలయ ఉద్యోగులు, అయిదుగురు వెరిఫికేషన్ అధికారులు, ఆరుగురు మండల స్థాయి పర్యవేక్షకులు కులగణన నిర్వహిస్తున్నారు. కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలో ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో కుల గణన ఆదివారం ప్రారంభించారు. తెల్లవారు జామునుంచే సచివాలయ అధికారి, వలంటీర్లు ఇంటింటా తిరిగి సర్వే చేశారు. కుటుంబ పెద్దల నుంచి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఇంటి యజమాని, ఇంటిలో సభ్యులు, వారి వయస్సు, ఏ సామాజిక వర్గానికి చెందినవారనే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి అప్‌డేట్ చేశారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము

కృత్తివెన్ను: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన మరింతగా ప్రజలకు చేరువ కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆయన ఆదివారం యండపల్లి, చెరుకుమిల్లి, చిన పాండ్రాక గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్తులో అనుసరించాల్సిన ప్రణాళికపై చర్చించారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన ఇటువంటి ముఖ్యమంత్రిని ఆశీర్వదించి మరోసారి అవకాశం ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన కార్యకర్తలు, పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, దేవస్థాన చైర్మన్ నాగేశ్వరరావు, ఎస్సీసెల్ కన్వీనర్ జాన్‌రత్నం, వ్యవసాయ శాఖ జిల్లా బోర్డు సభ్యుడు పట్టపు నాని, యండపల్లి సర్పంచ్ పిన్నెంటి ప్రభాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యండపల్లిలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఉప్పాల రాము

ఘనంగా సామూహిక సత్యవ్రతాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సత్యదేవుని వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుష్యశుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఆగమ పండితుడు దీవి బాలకృష్ణమాచార్యులు భక్తులతో వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు వ్రత పూజకు కావాల్సిన పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు

వేగంగా రిజర్వాయర్ ఇంటర్ కనెక్షన్ పనులు

గుడివాడ టౌన్: స్థానిక గుడ్‌మెన్ పేటలో రిజర్వాయర్ ఇంటర్ కనెక్షన్ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని పట్టణ తాగునీటి అభివృద్ధి కమిటీ సభ్యులు కె.ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పైప్ కనెక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఇంటర్ కనెక్షన్ పూర్తయితే మరింత లోతట్టు ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు.